


ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
బుధవారం 15 మే 2024








అభ్యర్థుల్లో ఉత్కంఠ





నిజామాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల పోరు ముగిసినప్పటికీ అభ్యర్థుల్లో ఉత్కంఠ మాత్రం వీడలేదు. ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందోనన్న ఆందోళన కనిపిస్తోంది. అనుచరుల ద్వారా నియోజకవర్గంలో నమోదైన పోలింగ్ సరళిపై ఆరా తీస్తున్నారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఎన్ని ఓట్లు వచ్చాయో ఆరా తీస్తున్నారు. తమకు సంబంధించిన బూత్ ఏజెంట్లు, అనుచరుల ద్వారా లెక్కలను చేపిస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని 1808 పోలింగ్ బూత్‌ల వారీగా వివరాలను తీసుకుంటూ ఒక అంచనాకు వస్తున్నారు. గెలుపు ఓటములపై నిర్ణయం తీసుకోవడంతో పాటు ఏ పోలింగ్ బూత్ పరిధిలో తమకు ఎన్ని ఓట్లు పడ్డాయి, ఎక్కడ తక్కువ వచ్చాయో తెలుసుకుంటున్నారు. నేతలు, సర్వే ఏజెన్సీలు, ఇతర మార్గాల ద్వారా తెలుసుకుంటూ ఏఏ వర్గాలు తమకు అండగా ఉన్నాయో చూసుకుంటూ పూర్తిస్థాయిలో అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో గెలుపుపై ధీమాకు వస్తున్నారు. పోలింగ్ శాతం పెరగడం వల్ల కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఇప్పటికే ఒక అంచనాకు రాగా ఓటరు నాడి పూర్తిగా స్పష్టం కాకపోవడంతో కౌంటింగ్ నాడు తేలనుండటంతో అప్పటి వరకు వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారు.

- అభ్యర్థుల గెలుపుపై ఎవరి అంచనాలు వారివే
- గెలుపు ఓటములపై జోరుగా చర్చ
- పోలింగ్ సరళిపై ఆరా తీస్తున్న అభ్యర్థులు
- వచ్చే నెల 4పైనే అందరి దృష్టి

పార్లమెంట్ ఎన్నికల పోరు హోరాహోరీగా ముగిసినప్పటికీ అభ్యర్థుల్లో ఉత్కంఠ మాత్రం వీడలేదు. ఓటర్ల తీర్పు ఎలా ఉంటుందోనన్న ఆందోళన కనిపిస్తోంది. ఇన్నాళ్లు అందరికీ జై కొట్టిన ఓటర్లు చివరకు ఎవరి వైపు మద్దతుగా నిలిచారోనన్న చర్చ జోరుగా సాగుతోంది. జిల్లాలో ఏ నలుగురు కలిసినా.. పోలింగ్ సరళిపైనే చర్చించుకోవడం కనిపిస్తోంది. అభ్యర్థులు సైతం పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ గెలుపుపై అంచనాలు వేసుకుంటున్నారు. మొత్తానికి ఎవరికి వారే గెలుపుపై ధీమాగా కనిపిస్తున్నా.. ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో జూన్ 4 వరకు వేచి చూడాల్సి ఉంది.

పెరిగిన పోలింగ్ శాతంపై అభ్యర్థుల అంచనా

ఈ పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికలకంటే పోలింగ్ పెరగడం వల్ల బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు తమకు లాభిస్తుందని భావిస్తున్నారు. ఎవరికి వారే అంచనాకు వస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కూడా తమకు ఓటింగ్ శాతం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ అర్వింద్ తన సొంత టీమ్‌తో ఎన్నికల సర్వేను అంచనా వేశారు. పార్లమెంట్‌లోని ఏ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎంత ఓటింగ్ వస్తుందో అంచనాకు వచ్చారు. పోలింగ్ బూత్‌ల వారిగా అంచనా వేశారు. తనకు దగ్గరగా ఉన్న నేతలతో అన్ని సెగ్మెంట్‌లోని పోలింగ్ బూత్‌ల వారిగా వివరాలను తీసుకొని ఎంత పోలింగ్ జరిగిందో ఒక అంచనాకు వచ్చారు. అదే రీతిలో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి కూడా పూర్తిస్థాయిలో సమీక్షించారు. పార్టీ ఎమ్మెల్యేలు, నేతల ద్వారా వివరాలను తీస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎంత పోలైంది. ఏ పోలింగ్ బూత్‌లో తమకు ఎక్కువగా ఓట్లు వచ్చాయో ఆరా తీశారు. ఆ బూత్‌ల వారీగా వివరాలను సేకరించి ఒక అంచనాకు వచ్చారు. ఏఏ వర్గాలు ఏ పార్టీకి ఎక్కువగా పట్టం కట్టారో ముందే కొంత మేరకు అంచనా వేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్ కూడా పార్లమెంట్ పరిధిలో ఎంత మేరకు పోలింగ్ అయ్యిందో అంచనాకు వచ్చారు. తనకు ఏ సెగ్మెంట్‌లో పెరుగుతుంది, ఏ సెగ్మెంట్‌లో తగ్గుతుందో ఆరా తీశారు. పార్టీ నేతల ద్వారా ఒక అంచనాకు వచ్చారు. పూర్తిస్థాయిలో అంచనా వేయడంతో పాటు వివిధ ఏజెన్సీల ద్వారా ఎంత శాతం తనకు ఓట్లు వస్తాయో అంచనా వేశారు. మూడు పార్టీల అభ్యర్థులు గెలుపుపై ధీమాతో ఉన్నారు.

పోలింగ్ సరళిపై ఆరా

పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో నియోజకవర్గాల్లో నేతలు కూడా ఒక అంచనాకు వస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తమ పరిధిలో ఎంత పోలింగ్ జరిగిందో ఆరా తీయడంతో పాటు తమ పార్టీలకు ఎన్ని ఓట్లు పోలింగ్ బూత్‌ల వారీగా వచ్చాయో ఒక అంచనాకు వస్తున్నారు. ఆ అంచనాకు అనుగుణంగా గెలుపు ఓటములపైనే అంచనా వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో పోలింగ్ ఎక్కువగా జరగడంతో క్యాడర్ కూడా కొన్ని చోట్ల గెలుపుపై ఆశతో ఉన్నారు. పోలింగ్ పెరగడం వల్ల బీజేపీ, కాంగ్రెస్ నేతలు కూడా కొంతమేర ఆందోళనలో ఉన్నారు. మహిళా ఓటర్లు ఎక్కువగా పోలింగ్ కేంద్రాలకు తరలిరావడం వల్ల ఎవరికి లాభిస్తుందో పూర్తిస్థాయిలో అంచనాకు రాలేకపోతున్నారు. కొన్ని చోట్ల గెలుపు ఓటములపై కిందిస్థాయిలో క్యాడర్ కూడా స్పష్టతకు రాలేకపోతున్నారు. పోటీ చేసిన అభ్యర్థులు కూడా లెక్కలు వేయడంతో పాటు సర్వే ఏజెన్సీలు, నిఘా వర్గ ఏజెన్సీలు ఇచ్చిన నివేదికల ఆధారంగా ఒక అంచనా వేసుకుంటున్నారు. ఎవరు గెలవనున్నారో ఎవరు ఈ ఎన్నికలకు ఎక్కువ మెజార్టీ రానుంది, ఎవరికి ప్రజలు పట్టం కట్టారో జూన్ 4న నిర్వహించనున్న పోలింగ్ కౌంటింగ్‌తో తేలనుంది.



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు

ఎన్నికలతో బాధ్యత పెరిగింది

- ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటుంది
- ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కయింది
- విలేకరుల సమావేశంలో జీవన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, మే 14: పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాతో తన అనుబంధం మరింత బలమైందని, కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలతో అభివృద్ధి విషయంలో బాధ్యత మరింత పెంచిందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, ఎమ్మెల్సీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌లు అన్నారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్లమెంట్ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పక గెలుచుకుంటుందని ఎన్నికల్లో సహకరించిన సీనియర్ నాయకులతో మొదలుకొని కార్యకర్తల వరకూ ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. బీఆర్ఎస్ తాము ఎలాగో గెలవలేమని భావించి మతతత్వ బీజేపీకి మద్దతు తెలిపిందన్నారు. నిజామాబాద్ మతసామర్యానికి ప్రతీక అని మరోసారి నిరూపితమైందని కొందరు మత విద్వేశాలను రెచ్చగొట్టాలని ప్రయత్నం చేసిన ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుందని పార్లమెంట్ ఎన్నికల్లో జరిగిన ఓటింగ్ శాతాన్ని పరిశీలిస్తే లక్ష మెజార్టీ ఖాయమన్నారు. మచ్చలేని జీవన్‌రెడ్డి వ్యక్తిత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలన్నీ కాంగ్రెస్ విజయానికి దోహదం చేస్తాయన్నారు. ఎన్నికల్లో సహకరించిన సీపీఐ, సీపీఐఎం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ, వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ ఉత్తర భారతదేశంలో ఉనికిని కోల్పోతుందని ఇక్కడ డబుల్ డిజిట్ సంఖ్యను గెలుస్తుందనడం సాధ్యం కాని పని అని వారు అన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, మాజీ ఎమ్మెల్సీలు ఆకుల లలిత, అరికెల నర్సారెడ్డి, రాజేశ్వర్, బాల్కొండ నియోజకవర్గ కోఆర్డినేటర్ సునీల్‌రెడ్డి, నగేష్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, ముప్పగంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్



స్ట్రాంగ్‌రూమ్‌కు సీల్ వేస్తున్న అధికారులు

ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం

- డిచ్‌పల్లి సీఎంసీ కౌంటింగ్ కేంద్రానికి తరలిన ఈవీఎంలు
- అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చిన ఈవీఎంలు
- ఎన్నికల పరిశీలకులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్
- సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి మూడంచెల భద్రత కొనసాగింపు



డిచ్‌పల్లిలోని సీఎంసీలో ఈవీఎంలను భద్రపరుస్తున్న సిబ్బంది

నిజామాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం సాయంత్రం ముగియడంతో అభ్యర్థుల భవితవ్యం ఇక ఈవీఎంలలో నిక్షిప్తమయింది. వచ్చే నెల 4న అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. ఓటర్ల మదిలో ఏముందో మరి కొద్ది రోజుల్లో తెలియనుంది. పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సజావుగా ముగియగా అధికారులు ఈవీఎంల తరలింపును మొదలు పెట్టారు. డిచ్‌పల్లిలోని సీఎంసీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి భారీ భద్రత మధ్య వీటిని తరలించారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు ప్రత్యేక స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. పోటీ చేసిన పార్టీల ఏజెంట్ల సమక్షంలో అధికారులు ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి మూడంచెల భద్రత కొనసాగిస్తున్నారు. కౌంటింగ్ పూర్తయేంతవరకూ ఈ భద్రతను కొనసాగించనున్నారు.

భారీ భద్రత మధ్య ఈవీఎంల తరలింపు

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం సాయంత్రం ముగియగానే ఈవీఎంలను మొదట డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు తరలించారు. అక్కడ మొత్తం సరిచూడటంతో పాటు పూర్తిస్థాయిలో ఈవీఎంలు వచ్చాయో లేదో లెక్క చూసుకున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులు అన్ని అప్పచెప్పిన తర్వాత సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ఈ ఈవీఎంల తరలింపును పోలీసుల భారీ భద్రత మధ్య కొనసాగించారు. డిచ్‌పల్లిలోని సీఎంసీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి తరలించారు. పార్లమెంట్ పరిధిలోని ఆర్మూర్, బోధన్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బాల్కొండ, కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాలకు చెందిన అన్ని ఈవీఎంలను ఈ కౌంటింగ్ కేంద్రానికి తీసుకువచ్చారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో జగిత్యాల జిల్లా రెండు నియోజకవర్గాల కౌంటింగ్‌ను అక్కడే చేయగా ఈ దఫా మాత్రం నిజామాబాద్‌కు తీసుకువచ్చారు. వీటిని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లో ఉంచారు. ఎన్నికల పరిశీలకులు ఎలీజ్ వజ్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్‌కుమార్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ మంద మకరంద్, పార్టీలకు సంబంధించిన ఏజెంట్ల సమక్షంలో వాటిని భద్రపరిచారు. ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌లో పెట్టి సీల్ వేశారు. సీఎంసీ పరిధిలో సీసీ కెమెరాలను అమర్చారు. జూన్ 4న జరిగే కౌంటింగ్ వరకు కేంద్ర బలగాల మూండచెల భద్రత మధ్య వీటిని ఉంచనున్నారు. ఈ కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ విధించడంతో పాటు లోనికి ఎవరూ రాకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ కౌంటింగ్ కేంద్రానికి నిరంతర భద్రత, నిరంతర విద్యుత్‌ను కొనసాగించనున్నారు. పూర్తిస్థాయి భద్రత ఏర్పాట్లు చేయడంతో పాటు 24 గంటలు మానిటరింగ్‌ను చేయనున్నారు. సీఎంసీకి ఎవరిని అనుమతివ్వకపోవడంతో పాటు అధికారులు, ఏజెంట్లు లోనికి వెళ్లేందుకు ప్రత్యేక మార్గాలను ఏర్పాట్లు చేశారు. సీఎంసీ చుట్టూ బారికేడ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు నిరంతర భద్రతను కొనసాగిస్తున్నారు. కేంద్ర బలగాలతో పాటు జిల్లా పోలీసులను కూడా వినియోగించి ఈ భద్రతను కొనసాగిస్తున్నారు.



పెరిగిన పోలింగ్ శాతం

- పార్లమెంట్ ఎన్నికల్లో 71.92 శాతం పోలింగ్ నమోదు
- మొత్తం 17లక్షల 4వేల 867 మంది ఓటర్లు
- 12,26,133 మంది ఓటు హక్కు వినియోగం

నిజామాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఈ దఫా ఎన్నికల్లో పోలింగ్ శాతం భారీగా పెరిగింది. ఈ ఎన్నికల్లో 71.92 శాతం పోలింగ్ నమోదవగా, గత పార్లమెంట్ ఎన్నికల్లో 68.37 శాతం నమోదైంది. పార్లమెంట్ పరిధిలోని ఆర్మూర్‌లో 73.14 శాతం, బోధన్‌లో 74.56 శాతం, నిజామాబాద్ అర్బన్‌లో 61.83 శాతం, నిజామాబాద్ రూరల్‌లో 74.54 శాతం, బాల్కొండలో 74.75 శాతం, కోరుట్లలో 73.75 శాతం, జగిత్యాలలో 73.85 శాతం పోలింగ్ నమోదైంది. నిజామాబాద్ అర్బన్‌లో గత ఎన్నికల్లకంటే ఎక్కువగా పోలింగ్ శాతం పెరిగింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో అర్బన్‌లో 56.25 శాతం నమోదు కాగా ఈ దఫా 5.68 శాతం పెరిగింది.

ఓటు వేసిన 12లక్షల 26వేల 133 మంది

పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 17లక్షల 4,867 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12లక్షల 26,133 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా జరగగా 10లక్షల 61 వేల 622 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ ఎన్నికల్లతో పోలిస్తే లక్షా 64వేల 511 మంది ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళలే ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 8లక్షల 6వేల 130 మంది ఉండగా, 5లక్షల 52 వేల 465 మంది ఓటు వేశారు. మహిళా ఓటర్లు 8లక్షల 98 వేల 647 మంది ఉండగా 6లక్షల 73 వేల 629 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల కంటే లక్షా 21వేల 164 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతరులు 90 మంది ఉండగా వారిలో 39 మంది ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గంలో 2లక్షల 12 వేల145 మంది ఓటర్లు ఉండగా లక్షా 55వేల 159 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బోధన్‌లో 2లక్షల 23 వేల 096 మంది ఉండగా లక్షా 66 వేల 330 మంది, నిజామాబాద్ అర్బన్‌లో 3లక్షల 4వేల 317 మంది ఉండగా లక్షా 88వేల 159 మంది, నిజామాబాద్ రూరల్‌లో 2లక్షల 56వేల 593 మంది ఉండగా లక్షా 91వేల 252 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాల్కొండలో 2లక్షల 26వేల 792 మంది ఉండగా లక్షా 69వేల 524 మంది ఓటు వేశారు. కోరుట్ల నియోజకవర్గంలో 2లక్షల 45వేల 249 మంది ఓటర్లు ఉండగా లక్షా 80వేల 867 మంది, జగిత్యాలలో 2లక్షల 36వేల 675 మంది ఉండగా లక్షా 74వేల 842 మంది ఓటు వేశారు. జిల్లాలో యంత్రాంగం తరఫున చేపట్టిన అన్ని కార్యక్రమాల వల్ల పోలింగ్ శాతం పెరిగినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి పోలింగ్ బూత్‌ల వారీగా ఏర్పాటు చేయడం, ఓటు నమోదు చేయడం, లిస్టుల పంపిణీ చేయడం వల్ల ఇది సాధ్యమైందన్నారు. ప్రజలు సహకరించి పోలింగ్ కేంద్రాలకు పెద్ద ఎత్తున వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.



ఐఎన్‌టీయూసీలో చేరిన నాయకులు

ఐఎన్‌టీయూసీ 327లో చేరిక

సుభాష్‌నగర్, మే 14: టీఆర్‌ఎస్‌కేవీ విద్యుత్ శాఖ నాయకులు భారీగా ఐఎన్‌టీయూసీ 327 యూనియన్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్ ప్రాంగణంలో ఐఎన్‌టియుసి 327 రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ 327 కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్టాండింగ్ రూల్స్, సీబీడీ గ్యాంగ్ జీతాల వ్యత్యాసాలపై కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 100కు పైగా టిఆర్ఎస్‌కెవి యూనియన్ నాయకులు ఐఎన్‌టియుసిలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలేష్, జిల్లా కార్యదర్శి పూదారి గంగాధర్, వేణుగోపాల్‌రావు, పెంటయ్య, మనోహర్, మోహన్, శ్రీనివాస్, ముస్తక్, నాగేష్, కళ్యాణ్, ప్రభు, సతీష్, నర్సింలు, శ్యామ్, రాజేష్, భూమేష్‌లు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు!

● ముళ్ల పొదలతో నిండిపోయిన మురుగుదొడ్లు ● యాచకులకు నిలయమంగా మారిన వేల్పూర్ ఆర్టీసీ బస్టాండ్

వేల్పూర్, మే 14: వేల్పూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వినియోగంలో లేక నిరుపయోగంగా మారి యాచకులకు నిలయంగా మారింది. తెలుగు గ్రామీణ పథకం కింద టీడీపీ హయంలో అప్పటి సీఎం ఎన్‌టీరామారావు ప్రభుత్వ ప్రతీ మండలంలో ప్రయాణికుల సౌకర్యార్థం రూ.5లక్షల వ్యయంతో ఆర్టీసీ బస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. బస్టాండ్ నిర్మించిన కొన్నాళ్ళకే ప్రయాణికులు దీనిని వినియోగించుకున్నారు. ఆ తర్వాత వేల్పూర్ మీదుగా భీమ్‌గల్‌కు వెళ్ళే బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడం, ఇక్కడ ఉన్న కంట్రోలర్ రాక పోవడంతో బస్టాండ్ ఆలనపాలన చూసేవారే కరువయ్యారు. దీంతో బస్టాండ్ ఆవరణలో మొక్కలు, ముళ్ళపొదలు పెరిగి అధ్వాన్నంగా తయారయ్యాయి. పగటి పూట పశువుల, పందులు, కుక్కలకు, మందు బాబులు, యాచకులకు నిలయంగా మారింది. అప్పట్లో గ్రామ మధ్యలో బస్టాండ్ ఏర్పాటు కోసం సరిపోడ స్థలం లేకపోవడంతో గ్రామానికి చివరిలో బస్టాండ్‌ను నిర్మించడం వల్లనే బస్టాండ్ నిరుపయోగంగా మారిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కాగా ప్రస్తుతం బస్టాండ్‌ను దాటి వేసి బస్టాండ్ సమీపంలో ప్రభుత్వ వివిధ శాఖల కార్యాలయాల భవనాలు కొనసాగుతున్నాయి. భవనాలు నిర్మించడం జరిగిందని, కమర్షల్ షాపింగ్, దుకాణాలు కూడా వెలిశాయని, మండల గ్రామాలకు సంబంధించిన ప్రజలు ప్రతీరోజు పనిపై ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తుంటారు. ఈ ప్రస్తుత పరిస్థితుల్లో బస్టాండ్‌కు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం బస్టాండ్ భవనాలకు సంబంధించి కిటికీలు, తలుపులను దొంగలు ఎత్తుకెళ్ళారని, మరుగుదొడ్లు అనవాళ్ళు కోల్పోయి ముళ్ళపొదల్లో నిండిపోయాయి ఇప్పటికైనా బస్టాండ్ లోపలికి బస్సులు వచ్చే విధంగా ప్రజలకు సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలి

: బద్దం రాజారెడ్డి, స్థానికుడు, వేల్పూర్



నిరుపయోగంగా మారిని బస్టాండ్‌కు మరమ్మత్తులు చేపట్టి వినియోగం తీసుకురావల్సిన అవసరం సంబంధిత అధికారులపై ఉంది. బస్టాండ్‌కు దగ్గరలో వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌ను వినియోగం తీసుకురావాలి. వేల్పూర్ మీదుగా భీమ్‌గల్‌కు వెళ్ళే బస్సుల సంఖ్య పెంచుతూ ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలి.



యాచకులకు నిలయంగా మారిన వేల్పూర్ ఆర్టీసీ బస్టాండ్



బస్టాండ్‌లో ముళ్లపొదలతో నిండిపోయిన మరుగుదొడ్లు

లాఠీచార్జ్‌పై ఉపాధ్యాయ సంఘాల ఖండన

నిజామాబాద్ అర్బన్, మే 14: నిబంధనల ప్రకారం టీఏ, డీఏ చెల్లించాలని అడిగినందుకు పోలీసుల బలప్రయోగాన్ని ఉపాధ్యాయులపై చేయడం దారుణమని ఉపాధ్యాయ సంఘాలు ఖండించాయి. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు పోలీసులతో లాఠీచార్జి చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యానంద్, రమేష్‌లు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన నారాయణఖేడ్ ఆర్‌డీవోపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా ఎన్నికల విధులు నిర్వహించిన పలువురు ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయడం దారుణమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెనిగళ్ల సురేష్, సల్ల సత్యనారాయణలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయంగా తమకు రావాల్సిన వేతన భత్యాలను ఇవ్వాలని అడిగిన వారిపై పోలీసులు లాఠీచార్జి చేయడం సరి కాదని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

కోటగల్లిలో భర్త ఇంటి ముందు భార్య ఆందోళన

నిజామాబాద్ అర్బన్, మే 14: కట్టుకున్న భర్త తనను మోసం చేశాడని ఆరోపిస్తూ భార్య ఆయన ఇంటి ముందు ఆందోళనకు దిగింది. మంగళవారం నగరంలోని కోటగల్లి ప్రాంతానికి చెందిన సిరిపురం మనస్విని 2016లో శ్రీనివాస్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకోగా అత్తగారికి సంబంధించిన ఇంటిని బహుమతిగా ఇచ్చారని అదే ఇంట్లో గత కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నానని కానీ తన భర్త శ్రీనివాస్‌కు మొదటి భార్య సవిత తన ఇంటిని స్వాధీనం చేసుకునేందుకు భర్తతో కలిసి వేధింపులకు పాల్పడుతుందని తనకు న్యాయం చేయాలని కోరింది. మహిళా సంఘాల ప్రతినిధులతో కలిసి ఆమె భర్త శ్రీనివాస్ ఇంటి ఎదుట ఆందోళన చేసింది. ఇదే విషయమై సవిత నివాసం ఉండే బొంబాయికి వెళ్లి ఫిర్యాదు చేశానని దీనిని సుమోటోగా స్వీకరించి జిల్లా కోర్టు, నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసానని మనస్విని తెలిపింది. అంతేకాకుండా ఇదే విషయమై సవిత ఆమె అనుచరులు గత శనివారం మధ్యాహ్నం తన ఇంటిపై దాడి చేసి అకారణంగా దాడికి దిగారని ఆమె ఈ సందర్భంగా వాపోయింది. అంతేకాకుండా ఈ దాడి వెనక తన భర్త శ్రీనివాస్ కుట్ర ఉందని కావున తనకు న్యాయం చేయాలని ఆమె కోరింది.

నేడు రూరల్ మండల సమావేశం

నిజామాబాద్ రూరల్, మే, 14: నిజామాబాద్ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 15న జరగనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మదురిమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మదురిమ తెలిపారు. సమావేశానికి ప్రత్యేక అధికారులతో పాటు మండల అధికారులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

‘సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు’

నిజామాబాద్ అర్బన్, మే 14: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రజలు, సిబ్బందికి సీపీ కల్మేశ్వర్ సింగనెవార్ మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. దీనిలో భాగంగా పార్లమెంట్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

తూనికలు కొలతల అధికారుల దాడులు

ధర్పల్లి, మే 14: తూనికల కొలతల అధికారులు మంగళవారం మండల కేంద్రంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గల వ్యాపార సంస్థలు, మార్కెట్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రిన్యూవల్ చేసుకోలేని వారిని గుర్తించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ తూనికల కొలతల అధికారుల ఆదేశాలను తప్పకుండా పాటించాలని, లేనిపక్షంలో జరిమానాలు ఉంటాయన్నారు. దాడులు కొనసాగుతాయని వారు తెలిపారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

మోపాల్, మే 14: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంజర్ గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి ట్రాక్టర్ నడుపుతున్న మెట్టు అశోక్(30) కిందపడి మృతి చెందాడు. అశోక్ ట్రాక్టర్ నడుపుతుండగా ఫిడ్స్ రావడంతో కిందపడటంతో అతనిపై ట్రాక్టర్ వెళ్లగా అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో పెళ్లి చేసుకున్న ప్రేమికులు

పోలీస్ స్టేషన్‌లో ప్రేమపెళ్లి

ఇందల్వాయి, మే 14: ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఓ ప్రేమపెళ్లి జరిగింది. ఇందల్వాయికి చెందిన నిఖిల్ అనే యువకుడు సిరికొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన హారిని అనే అమ్మాయితో గత కొన్ని రోజులుగా ప్రేమలో ఉన్నాడు. వారు ఇరువురు మేజర్లు కావడంతో ఓ ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌కు విషయం తెలిపారు. కాగా, పోలీస్ స్టేషన్‌లో అబ్బాయి తరఫు బంధువుల సమక్షంలో దండలు మార్చుకొని పెళ్లి చేసుకున్నారు. ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ స్టివెన్‌సన్

కల్లు విక్రయదారుడి అరెస్టు

● 5.22లీటర్ల లిక్కర్‌తో పాటు బైక్ స్వాధీనం

ఆర్మూర్ టౌన్, మే 14: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో సోమవారం రాత్రి కల్లు విక్రయదారుని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ స్టివెన్‌సన్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అక్రమంగా లిక్కర్ విక్రయం చేస్తున్న సమాచారం మేరకు దాడి చేయడంతో విక్రయదారుని వద్ద 5.22లీటర్ల లిక్కర్‌తో పాటు హీరో గ్లామర్ బైక్‌ను పట్టుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

ఫంక్షన్ హాళ్లపై పట్టింపేది..?

● కనిపించని సీసీ కెమెరాలు ● ఒకే రోజు రెండు పెళ్లిళ్లు ● ఫంక్షన్ హాళ్లలో ఫైర్ సెఫ్టీ పరికరాలు కరువు ● శానిటేషన్ విభాగానికి అదనపు భారం ● నిబంధనలు పాటించని యాజమానులు ● నిజామాబాద్ జిల్లాలో పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు



బోధన్ రూరల్, మే 14: బోధన్ డివిజన్‌తో పాటు జిల్లాలోని ఫంక్షన్ హాళ్లలో సంబంధిత అధికారుల నిఘా కరువైంది. నిత్యం పెళ్లిళ్లు, పుట్టిన రోజు ఇతరత్రా వేడుకలు నిర్వహించుకునే ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం, శుభకార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బందులకు గురి చేస్తుంది. సీసీ కెమెరాలు లేకపోవడం సందట్లో సడేమియా అంటూ దొంగలకు కలిసి వస్తుంది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సందర్భంగా వందల సంఖ్యలో గుమిగూడి ఉండే ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. ఫంక్షన్ హాల్‌లో సీసీ కెమెరాల ఏర్పాట్లపై అటు పోలీసులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం.



బోధన్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్

● **నిఘాతో అడ్డుకట్ట**

సీసీ కెమెరాలు ఉంటే శుభకార్యాలు చేసుకునే వారికి అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుంది. ఫంక్షన్ హాళ్లకు వచ్చే మహిళల బంగారు ఆభరణాల చోరీ ఘటనలు జరిగే అవకాశాలు ఉండవు.

● **ఫైర్‌సెఫ్టీ అనుమతులు కరువు**

ఫంక్షన్ హాల్ నిర్మాణాలకు గ్రామీణ ప్రాంతాలలో జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ పరిధిలో కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వీరితో పాటు అగ్నిమాపక శాఖ నుండి తప్పనిసరిగా ఫైర్‌సెఫ్టీ అనుమతి ఉండాలి. ఫంక్షన్ హాల్ నిర్మాణ సమయంలో ముందస్తుగా ప్రొవిజినల్ ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత ఒరిజినల్ ఫైర్‌సెఫ్టీ అనుమతి తీసుకోవాలి. ఫంక్షన్ హాల్స్‌లో అగ్నిమాపక నియంత్రణ పరికరాలు అందుబాటులో ఉంచితేనే ఫైర్‌సెఫ్టీ అనుమతి ఇస్తారు. కాని జిల్లాలో సుమారు 50వరకు ఫంక్షన్ హాళ్లు ఉండగా కేవలం కొన్నింటికి మాత్రమే ప్రొవిజినల్ ఎన్‌వోసీ ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఐదేళ్లకు ముందు నిర్మించిన వాటికి అనుమతులు లేవని ఐదేళ్ల నుంచే ఈ అనుమతులు తీసుకుంటున్నారని అధికారులు పేర్కొంటున్నారు. శుభకార్యాలు జరిగినప్పుడు భోజన విస్తరాకులు, ఇతర వ్యర్థాలు మున్సిపల్ శానిటేషన్ విభాగానికి తీసుకెళ్లడం అదనపు భారంగా మారింది. నిత్యం పెళ్లిళ్ల సీజన్‌లో రెండు పెళ్లిళ్లు జరిగే సరికి ఫంక్షన్ హాల్‌లోని చెత్తచెదారం తీసుకెళ్లడం వారికి చాలా భారంగా మారింది.

● **పర్యావరణాన్ని పరిరక్షించాలి..**

: వెంకట్ నారాయణ, మున్సిపల్ కమిషనర్, బోధన్



ఫంక్షన్ హాల్‌లో పర్యావరణాన్ని పరిరక్షించడానికి యజమాన్యాలు కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్‌లను వాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేని యెడల కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2012 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఏర్గట్లలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఏర్గట్ల, మే 14: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 2011-2012 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అందులో భాగంగా తమతో పాటు చదివిన తోటి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని తమతో గడిపిన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని తమకు విద్యావంతలు చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 2011-2012 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆర్మూర్ రూరల్, మే 14: ఈనెల 15వ తేదీన ఆర్మూర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సాయిరాం మంళవారం ఒక తెలిపారు. బుధవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ పస్క నర్సయ్య అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

డిచ్‌పల్లిలో..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు ఉదయం 11గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో జరగనుందని, ఎంపీడీవో రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు , మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావలని అధికారులు ప్రగతి నివేదికలు వెంట తీసుకురావలన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని విభాగాల అధికారులు హాజరుకావలని కోరారు.

సమ్మర్ క్యాంపునకు క్రీడాకారుల ఎంపిక

ముప్కాల్, మే 14: ఈనెల 16 ఉదయం 10గంటలకు ముప్కాల్ చైతన్య యువజన సంఘం మైదానంలో అండర్-16, అండర్-20 బాలుర విభాగం ఎంపిక చేయనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అంద్యాల లింగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 18నుంచి జున్ 1వ తేదీ వరకు సమ్మర్ స్పెషల్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నామన్నారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు 9989814410నెంబర్‌లో సంప్రదించాలన్నారు.



స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న క్షత్రీయ సమాజ్ సభ్యులు

ఘనంగా లక్ష్మీనారాయణుడి కల్యాణం

ఆర్మూర్ టౌన్, మే 14: పట్టణంలోని కిందిబజార్ లక్ష్మీనారాయణ మందిరంలో మంగళవారం లక్ష్మీనారాయణస్వామి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివారికి పూజలు, యజ్ఞం నిర్వహించి మంగళవాయిద్యాలతో పల్లకి సేవను నిర్వహించారు. లక్ష్మీనారాయణస్వామివారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ క్షత్రీయ సమాజ్ అధ్యక్షుడు అజారి మదన్‌మోహన్, కార్యదర్శి బారడ్ గంగామోహన్, రమాదేవి, ఖాందేశ్ సంగీత శ్రీనివాస్, వైద్యసంజయ్, గటడి కిషన్, డికె.శ్రీనివాస్, అజరీ రమేష్, రాజేందర్, విజయ్, రవీంధర్, దినేష్, సంతోష్, నీరజ్, తదితరులు పాల్గొన్నారు.

● **గ్రామాలయంలో లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు**



చంద్ర వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

భీమ్‌గల్ రూరల్: భీమ్‌గల్ పట్టణంలోని గ్రామాలయంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి ఉత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను చంద్రవాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామివారి ఆలయంలో దీపారాధన, స్వస్తి పుణ్యాహవచనం, మాతృక, మంటక దేవతాస్థాపన నిర్వహించారు. సాయంత్రం ఆరుగంటలకు ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించిన బంగారు ఆభరణాలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న విగ్రహాలను ఊరేగించారు. గ్రామాలయం మొత్తం గోవిందనామస్మరణలతో మార్మోగింది. ఉత్సవాలను ఆలయ అర్చకులు నంబిపార్థసారధి ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు.

కన్నులపండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

● హాజరైన హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి ● వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు

డిచ్‌పల్లి, మే 14: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో వెలసిన శ్రీదేవిభూదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది. వేంకటేశ్వర స్వామి ఆలయంలో ద్వాదశ వార్షికోత్సవం పురష్కరించుకొని ఐదు రోజుల పాటు ఆలయ నిర్వాహకులు వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ కల్యాణ మహోత్సవం, మహాకుంభాభిషేక కార్యక్రమాలను హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి మహాస్వామి చేతుల మీదుగా నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా 108 కలశాలతో పూజ ప్రత్యేకంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కాగా, మంగళవారం ఆలయ ప్రాంగణంలో కుంభాభిషేకం, బలిహరణం, విగ్రహల ఊరేగింపు, కన్నుల పండుగగా సాగింది. బ్రహ్మశ్రీ ఏలేటి పుశుపతి శర్మ, ఉమామహేశ్వర శర్మ, రాహుల్ త్రిపాటిలు స్వామివారి వేడుకలను అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రావుల బ్రహ్మానందం, పొసరాజు నాగర్జున, నాయుడు ఆంజనేయులు, రవి బాబు, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ధర్మారం(బి)లో శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద బ్రాహ్మణులు



పూజలు చేస్తున్న హంపీ విరూపాక్ష విద్యారణ్యభారతి స్వామి



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు



హాజరైన భక్తులు

బాలికల హాస్టల్ నిర్మాణం ఎప్పుడో?

● తెలంగాణ యూనివర్సిటీలో బాలికలకు కరువైన వసతులు ● ఇరుకుగా మారిన హాస్టల్ గదులు ● ఒకే భవనంలో 500 మందికి వసతి ● 300మందికి సరేపోయే భవనంలో 500 మంది విద్యార్థులకు వసతి ● తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు ● సమస్యకు సత్వరమే పరిష్కారం చూపాలంటూ విజ్ఞప్తి

డిచ్‌పల్లి, మే 14: రాష్ట్ర అవతరనకు ముందే ప్రత్యేక తెలం గాణ రాష్ట్రం పేరుతో ఉన్న ఏకైక యూనివర్సిటీ ఈ డిచ్‌పల్లి తెలం గాణ యూనివర్సిటీ. ఇంత ఘనమైన పేరున్న ఈ విశ్వవిద్యాల యంలో బాలికలకు తీవ్రమైన వసతి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం అవతరించి 10ఏళ్లు గడిచిన వర్సిటీలో బాలికల వసతి సమస్య నేటికి తీరాడం లేదు ఎన్నో సార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, రాష్ట్ర గవర్నర్‌కు వినతి పత్రాలు విద్యార్థులు అందించిన సమస్య పరిష్కరం కావడం లేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థినులు ఇక్కడికి పీజీ, ఉన్నత చదువుల కోసం వస్తుంటారు. గత 5సంవత్సరాల కాలంగా ఈ హాస్టల్ సమస్య తీవ్రంగా వేదిస్తున్న ప్రభుత్వ, పెద్దలు, ఉన్నత విద్యామండలి స్పందించకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పీజీ కోర్సుల్లో అన్ని విభాగాల్లో విద్యార్థినులే అధిక శాతం సీట్లు 100శాతం సీట్లలో 72మంది విద్యార్థినులే సీట్లు సాధిస్తున్నారు. దీంతో వర్సిటీలోని బాలికల హాస్టల్ లోని ఒక్కో గదిలో 5నుంచి 6గురు ఉండాల్సి ఉండగా.. 10 నుంచి 15మంది సర్దుబాటు చేసుకుంటున్నారు. తెలంగాణ యూనివర్సిటీలో 1851మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరగా 1226మంది బాలకలు పీజీ కోర్సులో ప్రవేశం పొందారు. గతంలో ఏన్నడు లేని విధంగా పీజీ కోర్సుల్లో బాలికలు ఎక్కువగా చేరుతుండటంతో హస్టల్ అకామీడేషన్ ఇబ్బందిగా మారుతుంది. దీంతో యూనివర్సిటీ అధికారులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో చేరే విద్యార్థులకు హస్టల్ వసతి కల్పించకుండా ఒత్తిడిని తగ్గించే ప్రయ త్నం చేస్తున్నారు. గత పదేళ్ల క్రితం 300 మంది కోసం నిర్మించిన బాలికల హస్టల్ లో ప్రస్తుతం 500 మంది ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కెమిస్ట్రీ, తెలుగు, ఇతర డిపార్టు మెంట్లలో 30 నుంచి 60 సీట్లకు పెంచిన హస్టల్ వసతి మాత్రం పెంచడం లేదని దీంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు.



తెలంగాణ యూనివర్సిటీ కళాశాల భవనం

● **ఏడాది గడిచినా నెరవేరని గవర్నర్ హామీ?**

గతంలో విశ్వవిద్యాలయానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ సందర్శించి సమయంలో విద్యార్థులు బాలికల హస్టల్ ఏర్పాటు చేయాలని ఆమెకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే సమస్య పరిష్కరించేందుకు స్వయంగా హస్టల్ సందర్శించిన గవర్నర్ హామీ ఇచ్చి ఏడాది కాలం గడిచిన ఇంత వరకు హస్టల్ వసతి నిర్మాణానికి చిల్లిగవ్వ కూడా మంజూరు కాకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. జిల్లా శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు వసతి గృహం ఏర్పాటు పట్ల ప్రత్యేక చొరవ చూపాలని విద్యార్థినులు కోరుతున్నారు.



యూనివర్సిటీ స్వాగత తోరణం



విశ్వవిద్యాలయంలోని బాలికల హాస్టల్ ఇదే..



ఇఫ్కో డైరెక్టర్‌గా మార గంగారెడ్డి

ఇఫ్కో డైరెక్టర్‌గా మార్క్‌ఫెడ్ చైర్మన్ గంగారెడ్డి

నిజామాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆసియాలోనే ప్రసిద్ధిగాంచిన ఇఫ్‌కో కంపెనీ డైరెక్టర్‌గా మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి ఎంపికయ్యారు. ఢిల్లీలో జరిగిన సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్‌గా ఆయన నాలుగేళ్లుగా పనిచేస్తున్నారు. ఇఫ్‌కో డైరెక్టర్‌గా ఎన్నికైన ఆయన ఐదేళ్లపాటు పదవిలో ఉండనున్నారు. జాతీయ స్థాయిలో పేరుగాంచిన ఈ ఇఫ్‌కో కంపెనీకి ఎంతో మంది పోటీ పడ్డారు. రాష్ట్రం నుంచి ఆయన ఏకగ్రీవంగా ఈ డైరెక్టర్ పదవికి ఎన్నికయ్యారు. రాష్ట్రానికి ఎరువుల కేటాయింపు, ఇతర రైతులకు సంబంధించిన అంశాలలో ఆయన కంపెనీతో చర్చించి ఉపయోగపడే నిర్ణయాలు తీసుకోనున్నారు. ఆయన డైరెక్టర్‌గా ఎంపిక కావడంపై ప్రాథమిక సంఘాల చైర్మన్లు హర్షం వ్యక్తం చేశారు.



రిశిక్‌రెడ్డి (నవ్యభారతి)



గణశ్రీ (ఎస్ఎస్ఆర్)

సీబీఎస్ఈ ఫలితాల్లో

జిల్లా విద్యార్థుల ప్రతిభ

నిజామాబాద్ అర్బన్, మే 14: సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. నగర శివారులోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్, మాధవనగర్‌లోని ఎస్ఎస్ఆర్ డిస్కవరి, జన్నెపల్లి ఎస్ఎస్ఆర్ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు.

సత్తా చాటిన ఎస్ఎస్ఆర్ డిస్కవరి విద్యార్థులు..

సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో నగర శివారులోని మాధవనగర్ లోగల ఎస్ఎస్ఆర్ డిస్కవరి, జన్నెపల్లి ఎస్ఎస్ఆర్ సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు మరోసారి సత్తా చాటారు. పాఠశాలకు చెందిన ఉదూత సాత్విక్ 454/500, పి.శరణ్యరెడ్డి 446/500, కాలగడ్డ గణశ్రీ 438/500, ఎస్.జగ్‌ప్రీత్ సింగ్ 431/500, గుత్తికొండ యశృతసాయి 429/500, జి.లతిక 428/500, జంగం కుశాల్ 421/500, ముక్క శ్రీమహి 418/500, నేరేళ్ల చేతన్ 411/500, ఆకుల శ్రీనిధి 410/500, ఎస్.శరితన్‌రెడ్డి 409/500, ఎల్.విష్ణుప్రియారెడ్డి 405/500, గాదె సరక్ష 404/500, ఎం.అస్మిత 400/500 మార్కులు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ మారయ్య గౌడ్, డైరెక్టర్ హరితగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కర్ పాల్గొన్నారు.

నవ్యభారతి విద్యార్థుల ప్రతిభ..

నగర శివారులోని దాస్‌నగర్‌లోగల నవ్యభారతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలను సాధించారు. పాఠశాలకు చెందిన రిశిక్‌రెడ్డి 453/500, మనికంఠరెడ్డి 443/ 500, అక్షయరాంరెడ్డి 441/500, వెన్నెల 440/500, శరణ్యరెడ్డి 438/500, కీర్తి 437/500, బాలాజీ 434/500, హాజీరామావిన్ 433/500, రెహాన్‌రెడ్డి 432/500, వర్ధన్‌రెడ్డి 431/500, అనురెడ్డి 427/500, ఫరేహా 420/500 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ సంతోష్‌కుమార్, శ్రీదేవిలు విద్యార్థులను అభినందించారు.

కన్నుల పండువగా రేణుకా జమదగ్నిల కల్యాణం

భిక్కనూరు, మే 14: మండలంలోని జంగంపల్లి గ్రామంలో గల రేణుకా ఎల్లమ్మ ఆలయ రెండవ వార్షికోత్సవ కార్యక్రమాన్ని గౌడసంఘం ఆధ్వ ర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద యం అమ్మవారికి ప్రత్యేక పూజలు, గౌరి గణపతి పూజ, పుణ్యవాచనం, నవగ్రహాపూజ, కుంకుమపూజ, అభిషేకాలు, యజ్ఞం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల నడుమ ఆలయ ప్రాంగణంలో రేణుకా ఎల్లమ్మ- జమదగ్నిల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహిళలు ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా ఆలయ ప్రాంగణంలో గౌడసంఘం ప్రతినిధులు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు, భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'

కామారెడ్డి టౌన్, మే 14: ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, అనిల్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు తమకు రావాల్సిన 5 రోజుల భత్యం రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతిగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నందుకు అమానుషంగా పోలీసులతో లాఠీచార్జి చేయించారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సిబ్బందికి ఇవ్వాల్సిన రెమ్యునరేషన్‌పై ప్రభుత్వం పీఓ, ఏపీఓలకు 3150, ఓపీఓలకు 1750 ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొన్ని జిల్లాల్లో మాత్రం ఆ ఆదేశాలను బేఖాతారు చేస్తు సిబ్బందికి డబ్బులను తక్కువ ఇచ్చారని తెలిపారు. తక్కువగా చెల్లించిన నియోజకవర్గాల్లో రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు.

అధ్వానంగా రహదారులు

- కంకరతేలి గుంతలమయంగా మారిన రోడ్లు
- వాహనాల రాకపోకలకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



గడ్కోల్-పూసల తండా రోడ్డు ఇలా..



గుంతల మయమైన మూషీర్‌నగర్ రోడ్డు

సిరికొండ, మే 14: మండల కేంద్రం నుంచి పలు గ్రామాలకు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్లు తారు లేచిపోయి గుంతలమయంగా మారాయి. ఏడేళ్ల క్రితం మట్టి రోడ్లను తారు రోడ్లుగా ప్రభుత్వం మార్చినప్పటికీ కేజీవీల్స్ ట్రాక్టర్లను నడిపించడం వల్ల తారు రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. రోడ్లపై గల తారు ధ్వంసం కావడం వల్ల కంకర తేలి గుంతలుగా మారింది. దీంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గడ్కోల్ నుంచి పూసల తండా రోడ్లు, కార్నల్ తండా నుంచి మూషీర్‌నగర్, మెట్టుమర్రి తండా మీదుగా కొండపూర్ వెళ్లే రోడ్లు గుంతలుగా మారడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గడ్కోల్ సబ్‌స్టేషన్ నుంచి పూసల తండాకు వెళ్లే రెండు కిలో మీటర్ల రోడ్డంతా తారు తేలి ధ్వంసమై గుంతలుగా మారింది. ఈ రోడ్డుపై నత్తనడక సాగించాల్సిందేనని గిరిజనులు చెపుతున్నారు. కార్నల్ తండా నుంచి మూషీర్‌నగర్, మెట్టుమర్రి తండా, గటడ్డమీది తండా మీదుగా కొండపూర్ వరకు గల రోడ్డు సైతం పలు చోట్లు తారు ధ్వంసమైంది. ఈ రోడ్డుపై వర్షాకాలం వస్తే చాలా ఇబ్బంది పడాల్సి వస్తుందని మెట్టుమర్రి తండా గిరిజనులు చెపుతున్నారు. బస్సులు, కార్లల్లో ప్రయాణించే వారికి సైతం నరక యాతన తప్పడం లేదు. రోడ్లను బాగు చేయించాలని అధికారులను, ప్రజాప్రతినిధులను వాహనదారులు కోరుతున్నారు. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్‌పై బాజిరెడ్డి సమీక్ష



రూరల్ నేతలతో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

నిజామాబాద్ రూరల్, మే, 14: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల బరిలో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీచేసిన రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పోలింగ్ సరళిపై సమీక్ష నిర్వహించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో రూరల్ మండల, మోపాల్ మండల ముఖ్య నేతలతో సమీక్ష చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బూత్ సెంటర్‌ల వారీగా జరిగిన పోలింగ్‌ను పరిశీలించారు. బీఆర్ఎస్‌కు వచ్చే ఓట్లపై నేతలతో సమీక్ష చేశారు. గ్రామాల్లో జరిగిన పోలింగ్, బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఓటువేసిన విధానంపై మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి తాను గట్టెక్కుతానా? అని అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ వ్యతిరేక ఓటు, మోదీ మైనార్టీల పట్ల ప్రకటించిన విధానంపై కూడా చర్చించారు. బాజిరెడ్డి గోవర్ధన్‌ను కలిసిన వారిలో వైస్ ఎంపీపీ సాయిలు, ఎంపీటీసీ అంకల గంగాధర్, మధుకర్, కొండూరు అశోక్, న్యాల్‌కల్ శ్రీనివాస్‌రావు, సిర్‌పూర్ ఉన్నారు.

మోదీ మూడోసారి ప్రధానమంత్రి కాబోతున్నారు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి

పెద్దబజార్, మే 14: నరేంద్రమోదీ దేశానికి జూన్ 4న మూడోసారి ప్రధానమంత్రి కాబోతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి అన్నారు. మంగళవారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇందూరు గడ్డపై రెండో సారి అఖండ మెజార్టీతో కాషాయ జెండా ఎగర వేయడం ఖాయమని అన్నారు. ఈ నెల 13న జరిగిన పోలింగ్‌లో సుమారు పార్లమెంట్‌లో 71.37 శాతం అని అధికారులు లెక్కలు చెబుతున్నారని అన్నారు. వారు ఇచ్చిన అఫిషియల్ 74.47 శాతం పోలింగ్ జరిగిందని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో 17లక్షల 4,861 మాత్రమే అందులో నుంచి 12లక్షల 18,468 మంది పోలింగ్‌లో పాల్గొన్నారని అన్నారు. జూన్ 4న కౌంటింగ్‌లో తెలుస్తుందని వంద శాతం ఇందూరు పార్లమెంట్‌లో కాషాయ జెండా రెండో సారి ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కంటే ఎక్కువగా ఓటు శాతం పార్లమెంట్ ఎన్నికల్లో జరిగిందన్నారు. పార్లమెంట్‌లో పడిన ఓట్లలో అత్యధిక 50 శాతం బీజేపీ పార్టీకి ఓటింగ్ జరిగిందని అన్నారు. పార్టీకి వెన్నుముకలా ఉంటూ కష్టపడిన ప్రతీ కార్యకర్తకు, నాయకులకు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని అదే విధంగా పార్టీ గుర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, న్యాలంరాజు, కార్పొరేటర్లు ప్రమోద్, మల్లేష్ యాదవ్, బీజేపీ నాయకులు బద్దం కిషన్, రాగి నారాయణయాదవ్, వెంకటరమణ, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దినేష్‌కులాచారి

ధాన్యాన్ని త్వరగా తరలించాలి

- కామారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రమోహన్

కామారెడ్డి టౌన్, మే 14: రెండు రోజుల పాటు ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యాన్ని రాత్రి పొద్దుపోయాక కూడా లిఫ్ట్ చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని శాబ్దిపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని, క్యాసంపల్లిలో ఓం శ్రీ వేంకటేశ్వర బాయిల్డ్ రైస్‌మిల్లును, పాల్వంచ మండలంలోని భవానిపేటలో భూలక్ష్మీ రైస్‌మిల్, గాయత్రి బాయిల్డ్ రైస్‌మిల్లులను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం రాశులను త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు అందించాలని, మౌలిక వసతులు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు కూడా ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఎగిరిపోకుండా చూసుకోవాలని తెలిపారు. అధైర్య పడవద్దని తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్‌ను మిల్లులకు తరలిస్తామని అన్నారు. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం తగ్గేలా చూడాలన్నారు. అనంతరం బాయిల్డ్, రా రైస్‌మిల్లు లను సందర్శించి అక్కడ వేచి ఉన్న లారీల్లో ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని, ట్రక్ షీట్ జారీ చేయాలని తెలిపారు.



జహీరాబాద్ గెలుపు ఎవరిదో?



మద్నూర్, మే 14: పార్లమెంట్ ఎన్నికల సమరం ముగియడంతో జహీరాబాద్ పార్లమెంట్‌లో గెలుపు ఎవరిది అనే చర్చ కొనసాగుతోంది. అభ్యర్థుల రాజకీయ భవిష్యత్తు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఫలితం జూన్ 4వ తేదీకి తేలనుంది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో 71.91 శాతం పోలింగ్ నమోదు కావడంతో జహీరాబాద్‌లో గెలుపు ఎవరిది అనే చర్చ కొనసాగుతోంది. జహీరాబాద్ పరిధిలోని జుక్కల్ నియోజక వర్గంలో 71.91 శాతం, బాన్సువాడలో 73.99 శాతం, ఎల్లారెడ్డిలో 74.74 శాతం, కామారెడ్డిలో 64.70 శాతం, నారాయణ ఖేడ్‌లో 70.83 శాతం, అందోల్ 73.68 శాతం, జహీరాబాద్ 74.50 శాతం పోలింగ్ నమోదు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. 21 రోజుల పాటు అభ్యర్థులు పార్టీల నాయకులు, మద్దతుదారుల్లో నరాలు తెగే ఉత్కంఠ ఉండగా, తాను ఓటు వేసిన నాయకుడు గెలుస్తాడో లేడోనని ఆసక్తి నెలకొంది. ఎగ్జిట్ పోల్స్ కూడా జూన్ 2 సాయంత్రం 6.30 గంటల తర్వాతనే విడుదల చేయాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశించిన నేపథ్యంలో అభ్యర్థుల గెలుపు ఓటములు ఎలా ఉంటాయో తెలియకుండా ఉంది. అభ్యర్థులు పలువురు తామే గెలుస్తామనే ధీమాలో ఉన్నారు. పోలింగ్ రోజున సర్వే చేయించి అంచనాలపై వస్తున్నారు. సర్వే ఫలితాలు వందశాతం నిజం అయ్యే పరిమితులు తక్కువగా ఉండటంతో అభ్యర్థుల్లో ఆందోళన ఉంటుంది. ఎన్నికలు జరిగిన నాటితో పోలిస్తే కౌంటింగ్ తేది సమీపిస్తున్న కొద్ది అంచనాలు, ఊహాగానాలు మారుతుంటాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పోలీస్ శాఖ, కేంద్రంలో ఉన్న సెంట్రల్ ఇంటలిజెన్స్ ఆధారంగా గెలుపు ఓటములు అంచనా వేస్తున్నారు. పోలింగ్ రోజున కూడా నియోజకవర్గం అంతటా సర్వే చేయించారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో మహిళల ఓట్లు కీలకం కానున్నాయి. వారి ఓట్లు ఎవరివైపు పడితే వారు విజయ తీరానికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది.



దోమకొండలో పది పాములను చంపేసిన గ్రామస్థుడు

ఇంటి సమీపంలో పది పాములు

దోమకొండ, మే 14: మండల కేంద్రంలోని గడికోట ఎదురుగా నివాసం ఉంటున్న బంజ ప్రకాశ్ తన ఇంటి సమీపంలో 10 పాములను మంగళవారం రాత్రి చంపివేశాడు. తన ఇంటి పక్కన నుంచి ఒకదాని తర్వాత ఒకటి వరుసగా పాములు రావడంతో వాటిని చంపినట్లు ప్రకాశ్ తెలిపారు. అయితే ముందుగా రాత్రి 7.30 గంటల సమయంలో ఒక పాము కనిపించడంతో దానిని చంపడం జరిగిందని మరో 10 నిమిషాల్లో మరొక పాము వచ్చిందని అలా వరుసగా రాత్రి 9 గంటల వరకు 10 పాములు డ్రైనేజీ నుంచి ఇంటి సమీపంలోకి వచ్చి ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించగా వాటిని చంపివేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో రకరకాల పాములు ఉన్నట్లు తెలిపారు. వరుసగా పాములు కాలనీలోకి రావడంతో కాలనీవాసులు భయందోళనకు గురయ్యారు.



మాట్లాడుతున్న పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జ్ పెద్దోళ్ల గంగారెడ్డి

'బీజేపీ నాయకులపై అధికార పార్టీ దౌర్జన్యం'

బిచ్కుంద, మే 14: రాష్ట్రంలో బీజేపీకి పెరిగిన ఆదరణను చూసి ఓర్వలేక అధికార కాంగ్రెస్ పార్టీ బీజేపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యానికి దిగుతున్నా రని పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జ్ పెద్దోళ్ల గంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్‌లో ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ లక్ష ఓట్ల మెజార్టీతో గెలుపొందుతారని తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో బీజేపీకి ఆదరణను చూసి నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ తమ్ముడు నాగేష్ షెట్కార్ బీజేపీ నాయకులు, కార్యకర్తలపై దాడికి పాల్పడడం సిగ్గు చేటన్నారు. దౌర్జన్యాలకు గుండా గిరీలకు బీజేపీ కార్యకర్తలు, నాయకులు భయపడేవారు కాదని ఒక్కొక్కరు 100 మందితో సమానంగా పార్టీ కోసం పని చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గ కన్వీనర్ శ్రీధర్ పంతులు, మండల అధ్యక్షుడు మల్లికార్జున్‌దేశాయ్, శివాజీపటేల్, మల్లు దేశా య్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటాం

- జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నిజాంసాగర్, మే 14: జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతీ ఒక్క బీఆర్ఎస్ కార్యకర్తకు, నాయకులకు రుణపడి ఉంటానని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మంగళవారం నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామంలో నాయకులతో మాట్లాడారు. గెలుపు ఓటములు సహజమని, పార్టీ కోసం కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలు ఇక ముందు కూడా ఇలాగే అందరం కలిసి పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి, సీనియర్ నాయకులు దుర్గారెడ్డి, నాయకులు, తదితరులున్నారు.

బోధన్ డివిజన్ అధికారుల ఫోన్ నెంబర్లు

ఆర్డీవో	అంబదాస్ రాజేశ్వర్	9491036893
బోధన్ ఏసీపీ	శ్రీనివాస్	8712659809
బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్	తూము పద్మ	8555939494
మున్సిపల్ కమిషనర్	వెంకట్ నారాయణ	6305249776
తహసీల్దార్	గంగాధర్	9491036917
రెవెన్యూ ఇన్‌స్పెక్టర్	వరుణ్	9397970606
శానిటరీ ఇన్‌స్పెక్టర్	శంకర్	9676846754
వాతావరణ శాఖ బోధన్	లక్ష్మారెడి	9885865423
ఎక్సైజ్ శాఖ సీఐ	పవన్ గౌడ్	8712658975
పట్టణ సీఐ	వీరయ్య	8712659870
రూరల్ సీఐ	నరేష్	8712659871
ఐసీడీఎస్ సీడీపీవో		6303829709
ఆర్టీసీ డిపో మేనేజర్		9959226001
ఆర్టీసీ ఎంక్వైరీ		9848500725
రైల్వే స్టేషన్		9491104601
ప్రభుత్వ జూనియర్ కళాశాల		9959951061
ప్రభుత్వ మధుమలంచ జూనియర్ కళాశాల		9182389186
ప్రభుత్వ డిగ్రీ కళాశాల		9494027975
వ్యవసాయ శాఖ		7288894588
ఎంపీడీవో		9849900110
ఎంపీవో		9618935060
ఆర్‌డబ్ల్యూఎస్		9550029442

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,400	రూ.66,800	రూ.860

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (10.30)
: కృష్ణమ్మ (1.40, 7.45, 10.40)
: బాక్ (4.35)
స్క్రీన్-2 : కృష్ణమ్మ (10.20) : ప్రతినిధి-2 (1.15)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (4.10)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (7.20, 10.30)
స్క్రీన్-3 : శ్రీకాంత్ (హిందీ) (10.25, 1.25, 7.20, 10.20)
: ఆ ఒక్కటి అడక్కు (4.25)
స్క్రీన్-4 : ప్రతినిధి-2 (10.40, 7.35, 10.30)
: ఆరంభం (1.35)
: ప్రసన్నవదనం (4.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఆ ఒక్కటి అడక్కు (10.45, 1.45, 7.40)
: ప్రతినిధి-2 (430, 10.30)
స్క్రీన్-2 : కృష్ణమ్మ (1.40, 7.40)
: బాక్ (4.30)
: ఆ ఒక్కటి అడక్కు (10.30)
స్క్రీన్-3 : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (10.45, 1.45, 7.30, 10.30)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (4.40)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15)
: ఆ ఒక్కటి అడక్కు (6.15, 9.15)
లలితమహల్ : ప్రతినిధి-2 (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : కృష్ణమ్మ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్